క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: మండలంలోని బాలాంత్రం శివారు గోపాలరావుపేట గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన రామాలయం నందు సీతా రాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల బ్రహ్మత్వంలో గత రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ హాజరై స్వామిని దర్శించుకున్నారు. ప్రతిష్ఠ అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీటీసీ కోట సత్తిబాబు, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఓదూరు ఫీడర్, చోడవరం సబ్‌స్టేషన్ ఫీడర్, కాకినాడ, రామచంద్రపురం 132 కేవీలు మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విజయానంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు చోడవరంలోని నూకల మిల్లు, ఆక్వా సరీ్వసులు, ఎస్ఎస్‌పేట పరిధిలోని ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరాకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కపిలేశ్వరపురం: వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు సోమవారం మండలంలోని కేదారిలంక, నారాయణలంక, వీధి వారిలంక గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధి పథకంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేశారు. ఎండ తీవ్రత ఎక్కువ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వైఎస్సార్ సీపీలోకి జెడ్.మేడపాడు మాజీ సర్పంచ్

మండపేట: మండలంలోని జెడ్.మేడపాడులో టీడీపీకి గండి పడింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు ప్రధాన అనుచరుడు, మాజీ సర్పంచ్ కొచ్చెర్లకోట నరసింహారావు (చిట్టిబాబు) టీడీపీకి రాజీనామా చేశారు. మండపేట పట్టణంలో సోమవారం జరిగిన వలంటీర్ల సమావేశంలో ఆయన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. చిట్టిబాబు చేరిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, నాయకులు కుడుపూడి రాంబాబు, దేవు ప్రసాద్ నాయుడు, తోరం శ్రీనివాస్, గొనిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పడమర ఖండ్రికలో ఫ్యామిలీ డాక్టర్

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలో వైద్యాధికారి పి.రత్నకుమారి రోగులను పరీక్షించారు. వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. హెచ్ఈ బి.రామారావు, ఆరోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పి దేవి వైద్య సేవలందించారు.

మొగలిపాలెంలో వలంటీర్ల రాజీనామా

కాజులూరు: మండలంలోని బందనపూడి శివారు మొగలిపాలెంకు చెందిన ముగ్గురు సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామ సచివాలయంలో కార్యదర్శికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వలంటీర్లు నల్లమిల్లి విజయలక్ష్మి, ఎస్.భార్గవదుర్గారెడ్డి, జ్యోతిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పింఛన్ల పంపిణీతో పాటు పలు ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరవేయటంతో తమకు కేటాయించిన కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచామన్నారు. అయితే ప్రతిపక్షపార్టీల నేతలు తమపై అర్థం పర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని కొన్ని నియోజకవర్గాలలో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు వలంటీర్లను నిర్బంధించి అమానుషంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వలంటీర్లపై ప్రతిపక్షపార్టీల నేతలు చేస్తున్న విమర్శలను నిరసిస్తూ రాజీనామా చేశామని అధికారులు తమ రాజీనామాలు ఆమోదించిన అనంతరం ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు.

బీఎల్వోలు, వీఆర్వోలకు అవగాహన సమావేశం

రాయవరం: మండలంలోని బూత్ లెవల్ అధికారులు, విలేజ్ రెవెన్యూ అధికారులకు సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. హోం ఓటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండపేట అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డీవీఎస్ ఎల్లారావు వారికి వివరించారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దారు జానకిరామయ్య, ఆర్ఐ పంపన రామారావు తదితరులు పాల్గొన్నారు.

యంత్రం.. అన్నదాత నేస్తం

- రైతులకు బాసటగా నిలుస్తున్న వరికోత యంత్రాలు
- జోరుగా సాగుతున్న వరికోతలు
- అనుకూలిస్తున్న వాతావరణం



యంత్రంతో చేపడుతున్న రబీ వరి కోతలు

రాయవరం: ఏటేటా వ్యవసాయంలో యాంత్రీకరణ వినియోగం పెరుగుతోంది. గతంలో మన రాష్ట్రంలో నెల్లూరు, చిత్తూరు వంటి జిల్లాల్లోనే రైతులు యంత్రాలను అధికంగా వినియోగించే వారు. ఇటీవల మన ప్రాంత రైతులు పూర్తి స్థాయిలో యాంత్రీకరణ వైపు మొగ్గు చూపుతున్నారు. రైతులు యాంత్రీకరణ వైపు మొగ్గు చూపడానికి పలు అంశాలు దోహద పడుతున్నాయి. ఉగాదికి ముందు ముందుగా పక్వానికి వచ్చిన వరిచేలు కోతలు ప్రారంభించగా, ఉగాది తర్వాత నుంచి వరి కోతలు ఊపందుకున్నాయి. పూర్తి స్థాయిలో వరికోతలకు యంత్రాలను వినియోగించడంతో ఒక వారం రోజుల్లో 50 శాతం వరకు వరికోతలు పూర్తయ్యే అవకాశముంది.

యంత్రాలపైనే శత శాతం వరికోతలు

ఖరీఫ్, రబీ పంటల సాగులో యాంత్రికీకరణ వినియోగం అధికమైంది. సంప్రదాయ విధానంలో సాగుకే ప్రాధాన్యత ఇచ్చే జిల్లా రైతులు ఆధునికీకరణ వైపు మొగ్గు చూపడానికి ఉపాధి హామీ పథకం అమలు కారణంగా కూలీల కొరత ఒక కారణమైతే..మండే ఎండలకు రాను రానూ కూలీలు వ్యవసాయ పనుల వైపు మొగ్గు చూపడం లేదు. అలాగే అతి తక్కువ సమయంలో ధాన్యం చేతికి రావడం కూడా మరో కారణమవుతోంది. యంత్రాల సహాయంతో వరికోతలు చేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. వరికోత యంత్రాలను రైతులు అధికంగా వినియోగించడంతో రాష్ట్రంలోని నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు తదితర జిల్లాల నుంచి వరికోత యంత్రాలను రప్పిస్తున్నారు. దీంతో పాటుగా ఇటీవల జిల్లాలో మంజూరు చేసిన వరికోత యంత్రాలతో రైతులు వరికోతలను చేపడుతున్నారు. ఇతర జిల్లాల నుంచి వాహనాలపై ఇక్కడకు తీసుకుని వచ్చి, ఇక్కడ వరికోతలు నిర్వహిస్తున్నారు. వరికోత యంత్రాన్ని వినియోగించడ ద్వారా ఎకరం చేలో పంట కోసి ధాన్యాన్ని రాశిగా పోయడానికి 70 నిమిషాల సమయం పడుతుంది. రైతులు యంత్రాలకు గంటకు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు చెల్లిస్తున్నారు. ఎకరం పొలంలో కోత కోసి, కుప్ప నూర్చడానికి కూలీలకు రూ.10 నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుంది. యంత్రాల వినియోగం ద్వారా కూలీ ఖర్చులు ఆదా అవ్వడంతో పాటు సమయం ఆదా అవుతుంది. అంతేకాకుండా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నా రైతులు అంతగా భయాందోళనలు చెందాల్సిన అవసరం ఉండదు. దీనితో ప్రస్తుత రబీలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. యంత్రాల వినియోగం తమకు అనుకూలంగా ఉంటుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ఖర్చును తగ్గించుకుంటున్నాం



యంత్రాల వినియోగం ద్వారా ఖర్చును తగ్గించుకుంటున్నాం. పారిశ్రామిక ప్రాంతం కావడంతో కూలీల కొరతను కూడా ఎదుర్కొంటున్నాం. గత కొన్నేళ్లుగా వరికోతలను యంత్రాల సాయంతోనే చేపడుతున్నాం.

– చేవా సత్యనారాయణ, రైతు, లొల్ల

మొత్తం అంతా యంత్రాలతోనే..



వ్యవసాయంలో యాంత్రీకరణ ఇటీవల బాగా పెరిగింది. సమయం ఆదా కావడం, ఖర్చులు తగ్గించుకునేందుకు రైతులు యంత్రాలను అధికంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుత రబీలో వాతావరణం కూడా బాగా సహకరించిందని చెప్పవచ్చు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

నేత్రదానం



మార్ని వీరేశ్వరాంబ

కె.గంగవరం: మండలంలోని పామర్రు గ్రామానికి చెందిన మార్ని వీరేశ్వరాంబ (78) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు వీరేశ్వరాంబ నేత్రాలను దానం చేయడంతో కాకినాడకు చెందిన ఐ బ్యాంక్ సిబ్బంది వారి గృహానికి చేరుకుని కార్నియాను సేకరించి భద్రపరిచారు. తల్లి మృతితో మరో ఇద్దరికి చూపు ఇవ్వడానికి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన పలువురు అభినందించారు.

రేపు కాజులూరులో మండల సర్వసభ్య సమావేశం

కాజులూరు: కాజులూరులో ఈ నెల 16వ తేదీ మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.రత్నంరాజు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున జిల్లా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుమతుల మేరకూ అత్యవసర తీర్మానాలు, సమీక్షలు మాత్రమే చేసుకోవచ్చన్నారు. మండల గ్రామాలకు చెందిన గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు స్థానిక సంస్థల ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 100 మంది యువత



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన అర్తమూరు యువతతో ఎమ్మెల్సీ, మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు, నాయకులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న రామచంద్రపురం ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాశ్

మండపేట: మండలంలోని అర్తమూరు గ్రామంలోని టీడీపీకి చెందిన సుమారు 100 మంది యువకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ యువ నాయకులు చిర్ల జయరాంరెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి నేతృత్వంలో కొవ్వూరి వీరారెడ్డి, పెందుర్తి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ గ్రామ యువకులు ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ అధ్యక్షతన ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీలో చేరిన వారందరికీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు లంక ప్రసాద్, పెందుర్తి అనిల్, కె. నాని, పెందుర్తి చంద్ర కిరణ్, పల్లి చిట్టిబాబు తదితరులు మాట్లాడుతూ భారీ మెజార్టీతో తోట త్రిమూర్తులు ఎమ్మెల్యేగా గెలిచేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. పంచాయతీ వార్డు టీడీపీ సభ్యుడు ఇళ్ల వెంకన్న, గొలుగూరి కనికరెడ్డి, పి. చిట్టిబాబు వల్లూరి ప్రసాద్, పెందుర్తి రాజు, ఆర్. నాని, టి చంద్రకిరణ్. సుందరపల్లి దుర్గాప్రసాద్, షేక్ అలీఖాన్, కొవ్వూరి సూర్యారెడ్డి, దెయ్యాల వీరబాబు ఇళ్ల వెంకన్న తాడిగం రెడ్డి, ఐ శ్యామ్, కొబ్బరికాయల అప్పారావు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఆర్యావటంలో 50 మంది..

కాజులూరు: టీడీపీలో కార్యకర్తల మనోభావాలకు అసలు ప్రాధాన్యం లేదని అందుకే పార్టీ కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నా తమను కాదని స్థానికేతరుడైన వాసంశెట్టి సుభాష్‌కు రామచంద్రపురం ఎమ్మెల్యే టికెట్టు ఇచ్చారని ఆ పార్టీ కాజులూరు మండల ఎస్సీ సెల్ మహిళా అధ్యక్షురాలు మాసాబత్తుల సత్యవతి అన్నారు. సోమవారం ఆర్యావటానికి చెందిన మాసాబత్తుల సత్యవతి, ఐటీడీపీ కార్యదర్శి వడ్లపాటి శాతికుమార్ టీడీపీకి రాజీనామా చేసి 50 మంది కార్యకర్తలతో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి స్వాగతం పలికారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని రానున్న ఎన్నికల్లో ప్రజలు మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవటం ద్వారా భవిష్యత్తులో పేదలు మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, ఆర్ఎంసీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వర్‌రెడ్డి, యాళ్ల బాబు, మాదిరెడ్డి పృథ్వీ, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, పార్టీ నాయకులు రాయుడు లీలాశంకర్, పాలిక వీరబాబు, చింతాకుల ప్రసాద్, ఉంగరాల శివ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ప్రజలే రక్ష

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- తాతపూడిలో వైఎస్సార్ సీపీ సమావేశం



తాతపూడిలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలే రక్ష అని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని తాతపూడిలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ చల్లా ప్రభాకర్, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, ఎంపీటీసీ జుత్తుక వెంకటలక్ష్మి, నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు వీధి వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐక్యత, సమన్వయంతో రానున్న ఎన్నికల్లో కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా పేదలకు మేలు చేసిన ప్రభుత్వం సీఎం జగన్ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, మండల సచివాలయాల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, సేవాదళ్ కన్వీనర్ పాలింగి కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

అడుగడుగునా నీరాజనం



వేగాయమ్మపేటలో సూర్యప్రకాశ్‌కు అడుగడుగునా పూలు జల్లుతూ స్వాగతం పలుకుతున్న మహిళలు



ద్రాక్షారామలో గ్రామ పెద్దలను కలసి మద్దతు కోరుతున్న పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌కు ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా జనం నీరాజనం పడుతున్నారు. వైఎస్సార్ సీపీ విజయానికి ఇదే నిదర్శనం అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు కదం తొక్కుతున్నారు. మండలంలోని వేగాయమ్మపేటలో సూర్యప్రకాశ్ సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సర్పంచ్ అంబటి తుకారం, ఎంపీపీ అంబటి భవాని నేతృత్వంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మహిళలు అడుగడుగునా పూల జల్లుతూ, హారతులు ఇచ్చారు. యువకులు పార్టీ జెండాలు పట్టుకుని జై జగన్, జై సూర్యప్రకాశ్ అంటూ నినాదాలు చేశారు. స్థానికుడిగా అన్ని వేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎమ్మెల్యేగా సేవ చేసే భాగ్యం కల్పించాలని సూర్యప్రకాశ్ ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఏపీడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, గ్రామ పెద్దలు గెద్దాడ సుబ్రహ్మణ్యం, కాళా సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దలను కలసి మద్దతు కోరిన సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ మండలంలోని ద్రాక్షారామలో సోమవారం పలువురు గ్రామ పెద్దలను కలసి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమ ప్రాధాన్యతతో జరిపించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ అవకాశం కల్పించాలని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌లకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, నాయకులు కోటిపల్లి అబ్బు, కైరం తాతాజీ, కర్రి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై దాడికి వైఎస్సార్ సీపీ నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో జరిగిన దాడిని ఖండిస్తూ మండపేట పట్టణంలో సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు నల్ల బాడ్జీలతో నిరసన తెలిపాయి. స్థానిక వాణీ మహల్ మహనీయుల సెంటర్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వారంతా నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు వస్తున్న అనూహ్య ప్రజా స్పందనకు కంగారు పడిన విపక్షాలు ఈ రకమైన దాడులకు పాల్పడుతూ తమ పిరికితనాన్ని చాటుకుంటున్నాయని విమర్శించారు. ఈ దాడి ఘటనపై నైతికంగా దిగజారిన విపక్షాలు అవాకులు చవాకులు పేలడం తప్ప ఇంతకంటే ఏం మాట్లాడతాయని ఎద్దేవా చేశారు. ఇలాంటి చిల్లర ప్రచారం ద్వారా ప్రజలను మభ్యపెట్టలేరని ఎమ్మెల్సీ ఖండించారు. ఈ నిరసన ప్రదర్శనలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ నేతలు కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, జెడ్పీటీసీ సభ్యురాలు కుడుపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల వాసు, పార్టీ టౌన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, సర్పంచులు గారపాటి సౌజన్య, బూరిగ ఆశీర్వాదం, కౌన్సిలర్లు మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు యర్రగుంట అయ్యప్ప, కోనాల చంద్రబోస్, చిక్కాల రాంబాబు, యాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఓటు దరఖాస్తుల పరిశీలన

కపిలేశ్వరపురం: నూతనంగా ఓటు హక్కు కోరుతూ అందిన ఆన్‌లైన్ దరఖాస్తులను బీఎల్ఓ స్థాయిలో పరిశీలన ప్రారంభించినట్టు ఎంపీడీఓ ఎం.కొండలరావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఆన్‌లైన్ దరఖాస్తులను గ్రామాల్లోని బీఎల్ఓలు దరఖాస్తుదారుని ఇంటికెళ్లి పంచనామా చేస్తున్నారన్నారు. త్వరితగతిన పూర్తి స్థాయి ప్రక్రియను పూర్తి చేసి అర్హులకు ఓటు హక్కును కల్పిస్తామని ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

హేతువాది పేరిలింగం మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: కె.గంగవరం మండలం పామర్రుకు చెందిన సాహితీవేత్త దేవగుప్తం పేరిలింగం మృతికి పలువురు సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు సంతాపం తెలిపారు. మండపేటకు చెందిన సంగమం సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ చల్లా మెహర్ ప్రసన్న, సామాజిక కార్యకర్త ఎం.గౌరవ్ సంతాపం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో స్థిరపడిన పేరిలింగం తన నాలుగు దశాబ్దాల సాహిత్య జీవితంలో 13 పుస్తకాలు రచించారన్నారు. ప్రాథమిక విద్యను అభ్యసించి, వడ్రంగి వృత్తి చేసుకుంటూ సామాజిక అంశాలపై అవగాహన పెంచుకున్న పేరిలింగం హేతువాద దృక్పథంతో చివరి వరకూ కొనసాగారన్నారు. తన సైకిల్‌కు చైతన్య రథమని పేరు పెట్టుకుని సైకిల్‌కు సాహిత్య పుస్తకాలను అమర్చుకుని ఇంటింటికీ అందించిన కార్యశీలి అన్నారు. సమాజంలోని మూఢ నమ్మకాలను, మత ఉన్మాద ప్రభాలపై ధైర్యంతో పోరాడారని, భౌతికంగా ఆయన లేకపోయినా ఆయన సాహిత్య కృషి సమాజ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు.

మునసబు నున్న బాబ్జీ మృతి



నున్న బాబ్జీ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామకు చెందిన నున్న వెంకటరెడ్డినాయుడు(బాబ్జీ) (78) సోమవారం మృతి చెందారు. ఆయన మునసబుగా పనిచేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌కు అత్యంత ఆప్తులు. ఎంపీ బోస్, ఆయన తనయుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దామిశెట్టి గంగాపురుషోత్తం, స్థానిక నాయకులు నరాల ఏడుకొండలు, నున్న వీర్రాజు, ప్రగతి చౌదరి, ప్రగతి వెంకన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, నున్న కల్యాణ్ తదితరులు నున్న బాబ్జీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా మంగళవారం అయితపూడిలో జరగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.సౌజన్య అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి చంద్రరావు అధ్యక్షతన జరిగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, సుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులపైన పరీక్షలు నిర్వహించి మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

- మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ
- మండపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మండపేట: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని 12 పంచాయతీల పరిధిలోని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఓ.రామకృష్ణ అధికారులకు సూచించారు.

మండపేట మండల పరిషత్ పాలకవర్గ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక మండల పరషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, ఈవోపీఆర్‌డీ ఐదం రాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రామకృష్ణ మండలంలోని సమస్యలపై చర్చించారు. కేశవరం, ద్వారపూడి, వేముల పల్లి కాలనీల్లోని మంచినీటి పథకాలపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్‌కు సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో కూలీలు పనిచేస్తున్నారని వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సంక్షేమ పాలనకే పట్టం కడతారు

- మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి
- ఎమ్మెల్యే అభ్యర్థి తోటకు మద్దతుగా 24వ వార్డులో ప్రచారం



మండపేట 24వ వార్డు ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి తదితరులు

మండపేట: మండపేట పట్టణ ఓటర్లు సంక్షేమ ప్రభుత్వానికే పట్టం కడతారని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులుకు మద్దతుగా పార్టీ శ్రేణులతో కలసి ఆమె సోమవారం స్థానిక 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ వార్డు కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ ప్రచారంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి కూడా పాల్గొన్నారు. వారంతా సైథిల్‌పేటలోని నాలుగు వీధుల్లో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఇంటింటా అందించిన సంక్షేమ పథకాలను గుర్తుచేసి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ తోట త్రిమూర్తులు అఖండ మెజారిటీతో గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పాల్గొన్న పార్టీ యువనేత పృథ్వీరాజ్ మాట్లాడుతూ తన తండ్రి తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రచారంలో అడబాల వీరబాబు, తుమ్మా వాసు, వెల్ల బేబీ కేదార్, గిరుసూరి శివ, అందనాపల్లి రవి, పల్లి రాంబాబు, గంటి ఉదయ్‌కుమార్, కరుణ, లోవరాజు, పెంకే శ్రీను, చింతల సతీష్, వైస్ చైర్మన్ వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కౌన్సిలర్లు అమలదాసు లక్ష్మీరుద్రమూర్తి, మలసాని సీతామహాలక్ష్మి, మొండి.భవాని, నీలం దుర్గమ్మ, శెట్టి కళ్యాణి, బొక్కా సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రామచంద్రపురం: పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. పట్టణ ప్రజలు, పాదచారుల సౌకర్యార్థం వేసవి ఎండల కారణంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు చలివేంద్రంలో చల్లటి మంచినీటిని ఏర్పాటు చేయటం జరుగుతుందని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్, మేనేజర్ మూర్తి రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.